క్లుప్తంగా

శ్రీనివాసులుకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ సైకాలజీ విభాగం పరిశోధక విద్యార్థి బి.శ్రీనివాసులుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాగ్నిటివ్ స్టైల్స్ ఇన్ రిలేషన్ టు క్రియేటివిటీ, మెంటల్ హెల్త్ అండ్ అడ్జస్ట్‌మెంట్స్ అమాంగ్ హైస్కూల్ స్టూడెంట్స్ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

రాయలచెరువుపేటలో ఉచిత వైద్య శిబిరం

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుపేటలో తిరుపతికి చెందిన డీఎస్ఆర్ ఆస్పత్రి వారు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు నారాయణరెడ్డి, చైతన్య, సంగీత నేతృత్వంలో గ్రామస్తులకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాయలచెరువు పేట సింగిల్ విండో మాజీ చైర్మన్ తిరుమలరెడ్డి, గ్రామస్తులు మాధవి, నాగభూషణం, లోకనాథం, రోసిరెడ్డి, చిన్నబ్బరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం.. నృత్యోత్సవం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన పౌరాణిక పద్యనాటకం, సాంఘిక నాటిక, శాస్త్రీయ, జానపద నృత్యోత్సవాలు నయనందకరంగా సాగాయి. జాతీయ స్థాయి నాటక పోటీల్లో భాగంగా రెండో రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో కళాబృందాలు పాల్గొని ప్రేక్షకులను అలరింపజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌కు చెందిన రసరంజని కళాకారులు సచికేత పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. అనంతరం కాకినాడుకు చెందిన గరికిపాటి రాజారావు కళానికేతన్ వారు ప్రదర్శించిన ఆకాంక్ష సాంఘిక నాటిక ఆలోచింపజేసింది. రాత్రి పాలకొల్లుకు చెందిన నటీనట సంక్షేమ సమాఖ్య వారు అనూహ్యం సాంఘిక నాటిక ప్రదర్శించి ప్రేక్షకులకు చక్కటి సందేశం అందించారు. నృత్యాలు, నాటకాలు ప్రదర్శించిన కళాబృందాలను అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల వినతికి పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్‌ను సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కింద వినతులు స్వీకరించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించారు.

రాష్ట్ర ప్రయోజనాలకే కట్టుబడాలి

తిరుపతి కల్చరల్ : కూటమి ప్రభుత్వం ప్రధానమంత్రి మోదీకి మోకరిల్లకుండా రాష్ట్ర ప్రయోజనాలకే కట్టుబడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, డి.సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ నగర కారదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ, ఆశ వర్కర్స్‌పై వేధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు.

సాయి ఆలయంలో మేయర్ శిరీషను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు





ఈశానేశ్వర నవలింగ ఆలయంలో గురుపూజ చేస్తున్న భక్తులు



వైభవం.. పౌర్ణమి సంబరం

సమాజానికి జ్ఞాన ప్రదాత గురువు.. మనిషిని మహనీయునిగా తీర్చిదిద్దే మహత్తర శక్తి గురువు.. మానవుని భవితకు బంగారు బాటలు వేసే నిర్దేశకుడు గురువు.. జీవనయానంలో నూతన విషయాలను నేర్పించి.. నడిపించే మార్గదర్శి గురువు. అలాంటి గురువులను స్మరించుకుంటూ ఏటా ఆషాఢ మాసం శుక్ల పక్షం శుద్ధ పౌర్ణమి నాడు గురుపూజోత్సవం నిర్వహిస్తుంటారు. గురుపౌర్ణమి.. వ్యాస పౌర్ణమి పేరిట ప్రత్యేక వేడుకలు జరుపుకుంటారు. ఈ క్రమంలోనే ఆదివారం వైభవంగా ×పౌర్ణమి॰ సంబరాలు చేపట్టారు. సాయి నాథుని మందిరాల్లో విశేష పూజలు చేశారు.

- ఘనంగా గురుపూజోత్సవం
- సాయి మందిరాలకు పోటెత్తిన భక్తులు
- వ్యాస భగవానుడికి విశేష పూజలు

తిరుపతి కల్చరల్ : నగరంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాయాల్లో ఆదివారం గురు పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొంకా వీధి, వీవీ మహల్‌రోడ్డు, లీలామహల్ రోడ్డులో, ఖాదీకాలనీ, ఆర్‌సీ రోడ్డు, శివజ్యోతినగర్, కేశవాయనగుంటలోని షిరిడీ సాయి బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఆలయాల వద్ద భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కొంకావీధిలోని షిరిడీ సాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మోహన్‌బాబు, సంస్కృత వర్సిటీలో వ్యాస మహర్షికి పూజలు



భక్తులతో కిక్కిరిసిన సాయిబాబా మందిరం

చేశారు. మేయర్ డాక్టర్ శిరీష విచ్చేసి సాయినాథుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి ,కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం ,బాలకృష్ణ, దుర్గం శ్రీను, మర్థం శివ, విజయలక్ష్మి ,రమేష్, హరిబాబు, ఏఎస్.మూర్తి, లక్ష్మి, ప్రభాకర్ పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్‌లో..

మోక్ష మార్గం చేరుకునేందుకు కావల్సిన సాధన ఎలా చేయాలో చెప్పేది గురువు అని శ్రీరామకృష్ణ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం గురుపూజోత్సవం, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష హోమం, భజనలు, ధ్యానం తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం ఆరాధన, భజననలు నిర్వహించారు.

వెండి ఆభరణాలు.. నగదు వితరణ

గురుపౌర్ణమిని పురస్కరించుకొని కొంకావీధిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయానికి ఆదివారం భక్తులు వెండి ఆభరణాలు, నగదు వితరణ చేశారు. ఇందులో భాగంగా కేతిరెడ్డి, పద్మ పల్లవి కుటుంబ సభ్యులు రూ.2లక్షలు విలువ చేసే 800 గ్రాముల వెండి ఆభరణాలను బహూకరించారు. అలాగే బి.గుండాలరెడ్డి కుటుంబ సభ్యులు సాయి ఆలయానికి రూ.1,00,116లు విరాళంగా అందజేశారు.

సంస్కృత వర్సిటీలో..

తిరుపతి సిటీ : నగరంలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీలో ఆదివారం వ్యాసపౌర్ణమిని పురస్కరించుకుని గురుపూజోత్సవం నిర్వహించారు. వర్సిటీలోని వ్యాస మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అద్వైత వేదాంత విభాగాధిపతి ప్రొఫెసర్ సతీష్ మాట్లాడుతూ మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించే ఏకైక వ్యక్తి గురువేనని తెలిపారు. మానవ జీవన నిర్మాణంలో గురువు పాత్ర కీలకమైందన్నారు. సత్యాన్ని బోధిస్తూ, ధర్మాన్ని కాపాడుతూ, న్యాయాన్ని సంరక్షిస్తూ విద్యార్థిని ఉత్తముడిగా తీర్చే మహోన్నత వ్యక్తి గురువు మాత్రమేనని వివరించారు. సమాజంలో ఎలా జీవించాలో బోధించి, జ్ఞానాన్ని నూరిపోస్తున్న గురువును ప్రతి వ్యక్తీ పూజించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వైవీ కృష్ణారావు పాల్గొన్నారు.

శ్రీశక్తిపీఠంలో..

రామచంద్రాపురం : మండలంలోని రాయలచెరువు సమీపంలో గల శ్రీశక్తిపీఠంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. ఆలయంలో కొలువైన మరకత శక్తి కాళీదేవికి, శ్వేత వారాహీదేవికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. లోక కళ్యాణార్థం 108 సుగంధ ద్రవ్యాలతో చండీ హోమం, శ్రీ మరకత శక్తి కాళీదేవికి అన్న కూటోత్సవం చేపట్టారు. ఈ క్రమంలోనే విశ్వ గురువు శ్రీ కృష్ణ భగవాన్, వ్యాస భగవాన్, జగద్గురు ఆది శంకరాచార్యులు, వాల్మీకి మహర్షి, కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ రమ్యానంద భారతికి విశేష పూజలు జరిపించారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి : గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఎంబీయూలో..

ఏ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ ఆవరణలో ఉన్న శ్రీసాయి బాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేకువనే కాకడ హారతితో స్వామివారికి తొలిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంబీయూ చాన్సలర్ డాక్టర్ మంచు మోహన్ బాబు, స్వామిజీ శ్రీముక్కామల శ్రీధర్ శర్మ తదితరులు బాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పున్నమి వెన్నెల్లో కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారు ఆదివారం గరుడవాహనంపై భక్తులను కటాక్షించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేక సేవ అనంతరం ఆలయంలోని మూలవిరాట్టును వజ్రాభరణాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు తనకు అత్యంత ప్రీతపాత్రమైన గరుడిపై అధిష్టించి నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

మరువలేనిది మీ సహకారం



కమిషనర్ అదితీసింగ్‌కు జ్ఞాపిక అందిస్తున్న కార్పొరేషన్ అధికారులు

- వీడ్కోలు సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ అదితీసింగ్

తిరుపతి తుడా: తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ విధి నిర్వహణలో పురపాలక సిబ్బంది సహకారం మరువలేనిదని కమిషనర్ అదితీసింగ్ తెలిపారు. వైఎస్సార్ కడప జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆమెకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది తనకు ఎంతో సహకరించారన్నారు. కొద్ది కాలమే తిరుపతిలో పనిచేసినా ప్రతి ఒక్కరూ మరువలేని తోడ్పాటు అందించారని వెల్లడించారు. ఉద్యోన్నతిపై వెళ్లినా, ఎక్కడ విధులు నిర్వహించినా ఇక్కడ పనిచేసిన కాలం జీవితంలో గుర్తుండిపోతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు తమ స్థాయికి మించి సహకరించారని చెప్పారు. రాబోయే అధికారులకు కూడా ఇదే విధంగా సహకరించి, సంస్థ పురోభివృద్ధి కృషి చేయాలని సూచించారు. కార్పొరేషన్ సిబ్బంది మాట్లాడుతూ అందరినీ ఒక తాటిపై తీసుకువచ్చి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కమిషనర్ అదితీసింగ్ చేసిన కృషి గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఆర్ఓలు సేతుమాధవ్, కేఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్రెడ్డి, సెక్రటరీ రాధిక, డీసీపీ శ్రీనివాసులు, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కుమ్మక్కై కల్కి ట్రస్ట్ కబ్జాలు



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

తిరుపతి కల్చరల్ : అటవీశాఖ అధికారులతో కుమ్మక్కై కల్కి ట్రస్ట్ వారు రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేశారని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఎన్ కండ్రిగ మండలం కల్లిపెట్టు గ్రామం వద్ద రిజర్వ్ ఫారెస్ట్‌లోని సర్వే నంబర్ 295లో 20.75 ఎకరాలను కల్కి ట్రస్ట్ ఆక్రమించుకుని అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేయాలని కోరారు. అటవీశాఖ నిబంధనలను తుంగలో తొక్కి జంతువులు, పక్షులకు విఘాతం కలిగించేలా కల్కి ట్రస్ట్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్కి ట్రస్ట్ అక్రమాలకు సహకరించిన అటవీ, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో హేతువాద సంఘ నేతలు డాక్టర్ ఏఆర్ రెడ్డి, వరదయ్యపాళెంలోని కల్కి ట్రస్ట్ బాధితులు చంద్రశేఖర్, రాజయ్య పాల్గొన్నారు.

దేశ సేవకు ఇదా బహుమతి

- మాజీ సైనికుడి భూమిలో బస్టాండ్ నిర్మాణం
- 20 ఏళ్లుగా బాధిత కుటుంబీకుల పోరాటం
- మీడియా ఎదుట గోడు వెల్లబోసుకున్న వైనం



మీడియాతో మాట్లాడుతున్న ముంతాజ్ తదితరులు

చంద్రగిరి : ప్రాణాలకు తెగించి దేశ సేవ చేసిన ఓ మాజీ సైనికుడి త్యాగానికి ఆర్టీసీ అధికారులు ఇచ్చే బహుమతి ఇదా అంటూ బాధితురాలు ముంతాజ్ ప్రశ్నించారు. ఆదివారం చంద్రగిరి బస్టాండ్ ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడారు. తన మామ షేక్ అబ్దుల్ కరీమ్ భారత సైన్యంలో పనిచేశారని, అహ్మదాబాద్‌లో విధులు నిర్వర్తించే సమయంలో ప్రమాదవశాత్తు రెండు కాళ్లూ పోగొట్టుకున్నారని తెలిపారు. దీంతో 1954 ఏప్రిల్ 18వ తేదీన అప్పటి ప్రభుత్వం చంద్రగిరిలో సర్వే నంబర్ 161, 162లో 4.5 ఎకరాలను మంజూరు చేసిందని వెల్లడించారు. మాజీ సైనికుడి కోటాలో కేటాయించిన భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారమని వివరించారు. సుమారు 20 ఏళ్ల క్రితం తన భర్త షేక్ అబ్దుల్ రషీద్ అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం చెన్నైకు వెళ్లామని, మూడు నెలల తర్వాత వచ్చే సరికి తమ స్థలంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అప్పట్లోనే కోర్టును ఆశ్రయించామని, ఇప్పటికీ కేసు నడుస్తోందన్నారు. అయితే ఆర్టీసీ అధికారులు తమకు అనుకూలంగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేసుకున్నారని ఆరోపించారు. పాత రికార్డులను తిరగేస్తే సదరు భూమి తన మామ కరీమ్ పేరు మీదే ఉందని సంబంధిత పత్రాలను మీడియా ఎదుట పెట్టారు. కోర్టు కూడా గత ఏడాది ఆ భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని ఆదేశాలు జారీ చేసిందని, ఆర్టీసీ అధికారులు మాత్రం ఆ ఉత్తర్వులను ధిక్కరించి బస్సులను పార్కింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ప్రశ్నిస్తే చులకనగా మాట్లాడుతూ హేళన చేస్తున్నారని వాపోయారు. చంద్రగిరిలో ఎవరిని అడిగినా ఆ భూమి తమదే అని చెబుతారన్నారు. తన భర్త కూడా మూడేళ్ల క్రితం కన్నుమూశారని, ఎలాంటి ఆధారం లేని పరిస్థితిలో ఉన్నామని కన్నీటిపర్యంతమయ్యారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పేరూరు చెరువుపై పచ్చగద్దలు!

అధికారంలోకి వచ్చింది మొదలు ఆవురావురుమంటూ ప్రభుత్వ స్థలాలను ఆరగిస్తున్న ×పచ్చ॰ గద్దల కన్ను ఇప్పుడు పేరూరు చెరువుపై పడింది. నియోజకవర్గ నేత అండదండలు ఉన్నాయని చెప్పుకుంటూ దర్జాగా ఆక్రమించేశారు. ఆ స్థలాన్ని చదును చేసి ప్లాట్ల విక్రయానికి తెరదీశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఒత్తిళ్ల మూలాన పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- గాంధీనగర్ వద్ద రూ.2కోట్ల విలువైన 250 అంకణాల స్థలం కబ్జా
- చదును చేసి, ప్లాట్ల విక్రయాలకు సన్నాహాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



చెరువు కట్టను ధ్వంసం చేసి ప్లాట్లు వేసేందుకు చదును చేసిన దృశ్యం

తిరుపతి రూరల్: జిల్లాలోనే అతిపెద్ద చెరువుల్లో ఒకటైన తిరుపతి రూరల్ మండలంలోని పేరూరు చెరువు పచ్చమూక పాలవుతోంది. సర్వే నంబర్ 303, 323లో దాదాపు 217 ఎకరాల్లో పేరూరు చెరువు విస్తరించి ఉంది. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఈ చెరువు మధ్యలో నుంచే వెళుతోంది. దీంతో చెరువుకు దక్షిణం వైపు 15 ఎకరాలు ఉన్నాయి. ఈ చెరువుకు అనుకుని సి.మల్లవరం పంచాయతీ గాంధీనగర్ ఉంది. ఈ పంచాయతీకి చెందిన టీడీపీ చోటా నాయకులు కొందరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువైన చెరువు స్థలంపై కన్నేశారు. తమకు నియోజకవర్గ నేత అండదండలు ఉన్నాయని చెప్పుకుంటూ దాదాపు రూ.2 కోట్ల విలువైన 250 అంకణాలను కబ్జా చేశారు. ఇప్పటికే చెరువు కట్టను ధ్వంసం చేసి చదును కూడా చేసేశారు. అక్కడ 12 ప్లాట్లు వేసి విక్రయించాలని స్కెచ్ వేశారు. ఒక్కో ప్లాట్ రూ.15 లక్షల చొప్పున విక్రయించి జేబులు నింపుకోవాలని యత్నిస్తున్నట్లు సమాచారం. చెరువు స్థలం ఆక్రమణలపై స్థానికులు ఆర్డీఓ, తిరుపతి రూరల్ తహసీల్దార్‌కు సైతం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే ఒత్తిళ్ల కారణంగా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కబ్జారాయుళ్ల చెర నుంచి పేరూరు చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



గరుడ వాహనంపై గోవిందుని విహారం



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఆదివారం సాయంత్రం శ్రీగోవిందరాజస్వామి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సర్వాంగసుందర అలంకారప్రియుడై శ్రీగోవిందరాజస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.